క్లుప్తంగా

పంచారామ క్షేత్రం వద్ద విగ్రహాల ధ్వంసం



దక్షిణామూర్తి విగ్రహం ముక్కును పాడు చేసిన దుండగులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం ముఖ ద్వారం, గోదావరి కాలువ రేవు వద్ద ఏర్పాటు చేసిన దక్షిణామూర్తి, ఆదియోగి విగ్రహాలను బుధవారం అర్ధరాత్రి ఆకతాయిలు ధ్వంసం చేశారు. భక్తులు, పంచారామ క్షేత్రం ఈఓ బళ్ల నీలకంఠం ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆలయంలోని సీసీ కెమేరాలను పరిశీలించి ఆకతాయిలను గుర్తించినట్టు స్టేషన్ ఎస్సై రమేష్ తదితరులు తెలిపారు.

మత్తు పదార్థాల విక్రయాలపై పోలీసుల తనిఖీలు



కొత్తపల్లిలోని దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప, ఉప్పాడ, కొత్తపల్లి గ్రామాల్లో పాఠశాలలు, కళాశాల సమీపంలోని దుకాణాల్లో గురువారం పోలీసులు తనిఖీలు చేశారు. పాఠశాలలు, కళాశాలలకు 100 మీటర్ల దూరంలో సిగరెట్లు, గుట్కా, ఆల్కహాల్ సంబంధిత పదార్థాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు.

సంక్షేమానికి ట్రెండ్ సెట్టర్ జగన్

- చంద్రబాబు మాటలు ప్రజలు నమ్మరు
- లోకేష్ ఖాతాలోవి జగన్ పథకాలే
- జమ్మలమడక నాగమణి



కాకినాడ రూరల్: గత వైఎస్సార్ సీపీ పాలనలోని నవరత్న పథకాలలో ఒకటైన 'అమ్మఒడి'ని 'తల్లికి వందనం'గా మార్చి జగన్ పథకాలను కాపీ కొట్టి లోకేష్ ఆ పథకాన్ని ప్రవేశపెట్టినట్టు చెప్పుకోవడం సిగ్గుచేటని ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి విమర్శించారు. ప్రజలను మోసం చేయడం అలవాటుగా చేసుకున్న చంద్రబాబు మాటలను నమ్మే పరిస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని ఆమె అన్నారు. ప్రపంచంలో ఎవరు ఈ ఘనత సాధించిన అది తన ఖాతాలో వేసుకోవడం చంద్రబాబుకు పరిపాటి అన్నారు. సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ట్రెండ్ సెట్టర్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఎవరైనా ఆయన పథకాలను కాపీ కొట్టాల్సిందేనని ఆమె అన్నారు. జగన్ పథకాల ను టీడీపీ మిత్రపక్షమైన జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ గతంలో మెచ్చుకున్న విషయాన్ని వృద్ధాప్యం వల్ల చంద్రబాబు మర్చిపోయారన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని తప్పుడు ప్రచారాలు మానుకుని తన గౌరవాన్ని కాపాడుకోవాలని, ఇతరుల సామర్థ్యాన్ని తన కుమారుడి సామర్థ్యంగా పేర్కొనడం సిగ్గుచేటని, దానిని ప్రజలు ఆమోదించరని ఆమె పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు

- ఆ భూమి తమదని ఓ వర్గం
- కాదు తమదని.. పత్రాలు ఉన్నాయని మరో వర్గం ఫిర్యాదు



నిరసన వ్యక్తం చేస్తున్న ఏనుగుపల్లి జ్యోతిప్రియ, వానపల్లి పోలీసు తదితరులు

కాకినాడ రూరల్: పూర్వం బర్మా కాందిశీకుల కోసం సర్పవరంలో ప్రభుత్వం అందించిన స్థలంలో బుధవారం రాత్రి అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. ఎకరం భూమిని ఇక్కడ పట్టు పరిశ్రమ కోసం అప్పట్లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కేటాయించారు. ఈ భూమి అన్యాక్రాంతమవుతోందని, దానిని స్వాధీనం చేసుకుని ఎస్సీలకు పంచాలని ఆ వర్గం నాయకురాలు ఏనుగుపల్లి జ్యోతిప్రియ డిమాండ్ చేశారు. సర్పవరం గ్రామంలో ఆటోనగర్‌కు ఆనుకుని ఈ స్థలం తమదేనంటూ కొందరు వ్యక్తులు భవనాలు కూల్చివేత చేపట్టగా కొందరు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కావడంతో గురువారం ఉదయం శిబిరం ఏర్పాటు చేసి జ్యోతిప్రియ, కనపర్తి పోలీసు, తదితరులు నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న సీఐ పెద్దిరాజు అక్కడకు చేరుకుని వారి నుంచి వివరాలు సేకరించారు. మరో వైపు ఈ స్థలంలో 58 సెంట్లు తమ కుమారుడు వెలగల రాజశేఖరరెడ్డి పేరిట కొనుగోలు చేశామని, పూర్తి హక్కులతో డాక్యుమెంట్లు ఉన్నాయని తమకు న్యాయం చేయాలని కాకినాడకు చెందిన సత్తి రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వే చేసి తమ స్థలం అప్పగించాలని ఇటీవలే జిల్లా కలెక్టరుకు అర్జీ పెట్టుకుని శుభ్రం చేస్తుండగా కావాలని గందర గోళం సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు.

కోడ్ జగనన్నకేనా?

- సార్వత్రిక ఎన్నికలు ముగిసినా ఆయన పేరుపై రంగులు
- కాలనీల ముఖద్వారంలో పేర్ల పునరుద్ధరణపై అధికారుల నిర్లక్ష్యం
- జగన్‌కు పేరు ప్రఖ్యాతులు రాకూడదని స్వామిభక్తి చూపుతున్న వైనం



సామర్లకోటలో జగనన్న కాలనీ ముఖ ద్వారంపై వేసిన రంగులు

సామర్లకోట: స్థానిక జగనన్న కాలనీ పేరును పునరుద్ధరించడంలో అధికారుల నిర్లక్ష్యంపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రం లే అవుట్‌లో సుమారు 52 ఎకరాల్లో 2,444 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. వీటిలో సుమారు 1500 వరకు ఇళ్లు పూర్తి చేశారు. దీంతో అప్పట్లో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అధ్యక్షతన జగనన్న కాలనీని అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 2023 అక్టోబరు 12న ప్రారంభించారు. ప్రత్తిపాడున రహదారికి ఇరువైపులా ఉన్న జగనన్న కాలనీకి రెండు వైపులా ముఖద్వారాలు ఏర్పాటు చేసి కౌన్సిల్ తీర్మానంతో జగనన్న కాలనీగా తీర్మానం చేశారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో భాగంగా వైఎస్సార్ జగనన్న పేరుపై నలుపు రంగు వేశారు. ఆ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయినా ఇప్పటి వరకు వైఎస్సార్ జగనన్న పేరుపై వేసిన రంగును తొలగించలేదు. ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగించే అధికారులకు ఆ రంగు తొలగించాలని అనిపించకపోవడంపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్సార్ సీపీకి పెరుగుతున్న ఆదరణ ఓర్వలేక జగనన్న కాలనీలో ఏడు పార్కులను ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దారు. దాంతో వైఎస్సార్ సీపీకి ఆదరణ పెరుగుతోందని, సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి ఖ్యాతి పెరగకూడదన్న కక్షతోనే ప్రస్తుత ప్రజా ప్రతినిధులు, అధికారులు ముఖద్వారాలపై పేరు రాయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఏపీసీఎస్ఎల్ వైపు ఉన్న కాలనీ ముఖద్వారంపై ఇలా..

గతంలో కౌన్సిల్ సమావేశాలల్లో కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని కౌన్సిలర్లు వాపోతున్నారు. రెండు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు జరగక పోవడంతో దీనిపై చర్చించడానికి అవకాశం లేకుండాపోయిందనే కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వైఎస్సార్ జగనన్న కాలనీ ప్రారంభోత్సవ శిలాఫలకం

కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లాం



ఈటీసీ లే అవుట్‌లోని వైఎస్సార్ జగనన్న కాలనీ ముఖద్వారంపై ఉన్న పేరుకు రంగులు వేసిన విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లాం. గతంలో తాను పని చేసిన ప్రదేశాల్లోని భవనాలకు రంగులు వేయలేదని, పేపర్లు అతికించామని చెప్పారు. గతంలో ఉండేలా పేర్లు రాయిస్తానని హామీ ఇచ్చి నెల గడుస్తున్నా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ విషయాన్ని తమ నాయకుడు దవులూరి దొరబాబు దృష్టికి తీసుకువెళ్లాం. ఆయన స్వయంగా పరిశీలించారు.

– ఆవాల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్, సామర్లకోట

స్పందించక పోతే తామే రాయించుకుంటాం



మున్సిపల్ అధికారులు జగనన్న కాలనీ ముఖద్వారంపై పేర్లు రాయించడానికి సుముఖంగా లేకుంటే తమ కార్యకర్తలచే రాయిస్తాం. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య దృష్టికి తీసుకువెళ్లాం. ఇంత కాలం ఎందుకు నిర్లక్ష్యం చేశారో అర్థం కాలేదు. 15వ తేదీ తరువాత జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకువెళ్తాం. కాలనీ వాసులు ముఖద్వారంపై పేరు లేని విషయాన్ని తన దృష్టికి తీసుకురావడంతో ఈనెల 8న పరిశీలించి అక్కడి నుంచే కమిషనర్‌కు ఫోన్ చేశాను.

– దవులూరి దొరబాబు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, సామర్లకోట

వ్యవస్థలన్నీ ఇన్‌చార్జిల పాలనలోనే..

పిఠాపురం: ఆయన ఇక్కడ లేకుంటే ఏం.. ఆయన పెట్టిన వ్యవస్థలు ఇక్కడ పని చేస్తున్నాయి అంటు జనసేన నేతలు చెబుతున్నారు. అవును అదీ నిజమే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇలాకాలో పని చేస్తున్న వ్యవస్థలన్నీ ఇన్‌చార్జిలే చక్కబెడుతుండడం విశేషం. గొల్లప్రోలు నగర పంచాయతీకి పిఠాపురం మున్సిపల్ కమిషనర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. పిఠాపురం తహసీల్దారు గోపాలకృష్ణ గొల్లప్రోలుకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తుండగా, గొల్లప్రోలు ఎంపీడీఓ స్వప్న పిఠాపురానికి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. కొత్తపల్లి ఎంపీడీఓగా డిప్యూటీ ఎంపీడీఓ ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్నారు. ఇలా ఒకటి కాదు రెండు కాదు ముఖ్యమైన పోస్టులు అన్ని ఇన్‌చార్జులే కావడం గమనార్హం. అధికారులు ఇక్కడ నుంచి వెళ్లడమే కాని ఇక్కడకు రావడానికి ఆసక్తి చూపడం లేదనడానికి ఇంత కన్నా నిదర్శనమేముంది అని స్థానికులు అంటున్నారు. అత్యంత కీలకమైన మున్సిపాలిటీలకు ఒకరే అధికారి ఉండడం ఇక్కడ తప్ప మరెక్కడా లేదంటున్నారు. ఇక గ్రామాల్లో కార్యదర్శులు, వీఆర్‌ఓలు అయితే చెప్పనక్కరలేదు.

సామూహిక కుంకుమ పూజలు

కరప: స్థానిక గ్రామదేవత ఉప్పాలమ్మ ఆలయంలో గురువారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కరప, పరిసర గ్రామాలనుంచి 120 మంది మహిళలు కుంకుమ పూజలు చేయించుకోగా వేదపండితులు మాచరి సత్యకామేశ్వర పురుషోత్తమశర్మ పూజాదికాలు చేయించారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు వితరణతో మూడు రోజులు ముందుగా అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు.

నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు గుర్తింపు



వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ సత్తిబాబు

సామర్లకోట: నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మంచి గుర్తింపు వచ్చిందని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. వేట్లపాలెం కొండపల్లి గంగాధరరామారావు మెమోరియల్ జెడ్పీ హైస్కూల్‌లోని తల్లిదండ్రుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హెచ్‌ఎం అనురాధ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రణాళికలు : ఎమ్మెల్యే రాజప్ప

విద్యాభివృద్ధికి ప్రభుత్వం నూతన ప్రణాళికలను రూపొందిస్తోందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నిమ్మకాలయ చినరాజప్ప అన్నారు. మెగా పేరెంట్స్ మీటింగ్‌ను పురస్కరించుకొని స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు పాల్గొని అధికారులకు, తల్లిదండ్రులకు పలు సూచనలిచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు ఉన్నాయని వాటిని ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన తల్లిదండ్రు మెగా సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు ఇచ్చారు. పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీదేవి అధ్యక్షత వహించగా ఎంఈఓ 2 పి.పుల్లయ్య, సీడీపీఓ ఉషా, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎస్ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

స్నేహపూర్వక పరిష్కారాలకు 'మధ్యవర్తిత్వం'

కోర్టు కేసులపై జడ్జి చంద్రమౌళీశ్వరి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి చంద్రమౌళీశ్వరి

పెద్దాపురం: మధ్యవర్తిత్వం ద్వారా స్నేహపూర్వక వాతావరణంలో కేసుల పరిష్కారం సాధ్యమని స్థానిక ఏడో అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి అన్నారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో గురవారం స్థానిక కోర్టు ఆవరణలో ‹జాతీయ మధ్యర్తిత్వతంతో కేసుల పరిష్కారం› వారోత్సవాల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మధ్యర్తితత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవడం వల్ల ఇరువర్గాలకూ సమయం, కోర్టు ఖర్చులు ఆదా అవుతాయని పేర్కొన్నారు. చాలా మంది ఏళ్ల తరబడి న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఇటువంటి వారికి మధ్యవర్తిత్వం దోహదపడుతుందన్నారు. స్థానిక కోర్టు పరిధిలో మధ్యర్తిత్వంపై శిక్షణ పొందిన న్యాయవాదులు ఏవి జనార్దన్, దేవేంద్రకుమార్ జైన్, టి.నూకరాజు, మడికి రాంబాబు, అత్తిలి ప్రభూజీ, షేక్ వలీబాబు, ఎస్.విశాలాక్షి ఉన్నారని, వారు మధ్యవర్తిత్వం ద్వారా కేసు పరిష్కారానికి సహకరిస్తారని పేర్కొన్నారు. ఈ పరిష్కారాలకు చట్టబద్ధత కల్పించబడుతుందన్నారు. కుటుంబ కేసులు, ఆస్తి తగాదాలు, క్రిమినల్ కేసులు, మోటార్ వాహనాల కేసులు, ఈ మధ్యవర్తితత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. జూలై 1 నుంచి 90 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి దీప దైవకృప, జూనియర్ సివిల్ జడ్జి ఎల్.దేవి రత్నకుమారి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తటవర్తి సత్యనారాయణ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీఓ సంఘం కరప కార్యవర్గం ఎన్నిక



కొత్త కార్యవర్గంతో జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు

అధ్యక్షుడిగా బీఆర్‌వీ చౌదరి

కరప: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఏపీ ఎన్‌జీఓ (ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్) అసోసియేషన్ పరిధిలోని కరప యూనిట్ కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా బీఆర్‌వీ చౌదరి మూడోసారి ఎన్నికయ్యారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం కరప, కాకినాడ రూరల్ మండలాలు, ఏపీఎస్‌పీ కార్యాలయం, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసు, పండూరు పీహెచ్‌సీ ప్రాంతాలలోని ఎన్‌జీఓలు సమావేశమై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఒకో పోస్టుకు ఒకే నామినేషన్ రావడంతో నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి ఎ.సత్తిరాజు (కాకినాడ పట్టణ అధ్యక్షుడు), అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా మట్టపర్తి వెంకటేశ్వరరావు (కాకినాడ పట్టణ కార్యదర్శి) ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రామ్మోహనరావు, పేపకాయల వెంకటకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎస్.చంద్రరావు, పి.పాండురంగారావు, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి వై.రామకృష్ణ తదితరులు కరప యూనిట్ కొత్త కార్యవర్గానికి అభినందనలు తెలిపి, సంఘ అభివృద్ధికి, యూనిట్‌లోని ఎన్‌జీఓల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు.

సభ్యులు వీరే

ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ కరప యూనిట్ అధ్యక్షుడిగా బీఆర్‌వీ చౌదరి (కరప పీహెచ్‌సీ), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.వెంకటరత్నం (పీఎస్, తిమ్మాపురం) ఉపాధ్యక్షులుగా యు.వినోద్(పండూరు పీహెచ్‌సీ), ఎస్.ఫణిమురళీకృష్ణ (చీడిగ సచివాలయం), కె.నానిబాబు (సబ్ రిజిస్ట్రార్, సర్పవరం), కార్యదర్శిగా కె.కేశవరావు (వాకలపూడి పంచాయతీ) సంయుక్త కార్యదర్శులుగా ఎస్.కిరణ్‌కుమార్ (యండమూరు సచివాలయం), సీహెచ్ మణికుమార్ (వాకలపూడి–2 సచివాలయం), పి.వీరభద్రరావు (పీఎస్, వేళంగి), మహిళా సంయుక్త కార్యదర్శిగా వి.కామేశ్వరి (వాకలపూడి సచివాలయం), కోశాధికారిగా కె.రాఘవకుమార్ (కరప పీహెచ్‌సీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి పూజలు



పెద్దాపురంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో శిరిడీ సాయివారు

సామర్లకోట: గురు పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పండితుడు వేమూరి సోమేశ్వరశర్మను ఈఓ బళ్ల నీలకంఠం సత్కరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

ఘనంగా చండీహోమం

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లి ఆలయంలో గురువారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఈఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రాల నడుమ వెండి, బంగారు పుష్పాలతో పూజలు చేశారు. ఆషాఢ జాతర మహోత్సవాల్లో భాగంగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

10 వేల మందికి అన్నదానం

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లోని షిరిడి సాయి మందిరంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా మేలుకొలుపు హారతి, పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, వందలాదిగా భక్తులు బాబాను దర్శించుకున్నారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వే కల్యాణ మండపంలో ఆలయ కమిటీ నాయకులు ఏర్పాటు చేసిన అన్నదానంలో సుమారు 10 వేల మంది భోజనం చేశారు. ఆలయ కమిటీ కార్యదర్శి గంథ్రోతుల సత్యనారాయణ, కోశాధికారి డి.రాజబాబు, కమిటీ నాయకులు భక్తులకు సేవలందించారు. అలాగే పిఠాపురం రోడ్డులోని సాయిబాబా మందిరంలో, కోట్లమ్మ చెరువు వద్ద సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు.



పాదగయ క్షేత్రంలో దత్తాత్రేయ స్వామివారు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: మండల పరిధిలోని పలు ఆలయాల్లో గురువారం గురుపౌర్ణమి పూజలను నిర్వహించారు. కొత్తపల్లిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, సాయిబాబా, ఉప్పాడలోని వెంకటేశ్వరస్వామి, ఐశ్వర్యసాయి, సాయిబాబా, కొమరగిరిలోని సాయిబాబా, వేణుగోపాల స్వామి, గోర్స‌లో పురాతన సీతారామ లక్ష్మణ ఆలయంలో, రమణక్కపేట విజయ జనార్ధన స్వామి ఆలయాలతో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పలు సాయిబాబా ఆలయల వద్ద కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్న సమారాధన చేశారు.



ప్రత్యేక అలంకరణలో భీమేశ్వర స్వామివారు

పిఠాపురంలో..

పిఠాపురం: దత్తాత్రేయుని అవతారాల్లో ఒకటైన శ్రీపాదుని జన్మస్థలమైన పిఠాపురంలో గురుపూజోత్సవం కనుల పండువగా సాగింది. గురు పౌర్ణమి సందర్భంగా గురువారం నియోజకవర్గంలోని పలు సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం మహారాష్ట్ర నుంచి వచ్చిన వేలాది భక్తులతో కిటకిటలాడింది. పాదగయ క్షేత్రంలో దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలతో పాటు పిఠాపురం పట్టణం, గొల్లప్రోలు నగర పంచాయతీలలోని ఆలయాల్లో గురు పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి.

చేప రైతులు మన ఆర్థిక నాయకులు

- నన్నయ వర్సిటీ ప్రొఫెసర్ రమణీశ్వరి
- ఘనంగా జాతీయ చేప రైతు దినోత్సవం

బాలాజీచెరువు: నేటి కాలంలో చేపల పెంపకం ప్రధాన ఆదాయ వనరుగా మారిందని నన్నయ వర్సిటీ ప్రొఫెసర్ రమణీశ్వరి పేర్కొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాతీయ చేప రైతు దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ ఏటా జూలై 10న జాతీయ చేప రైతుల దినోత్సవం నిర్వహిస్తున్నామని, చేపల రైతులు మన ఆర్థిక నాయకులన్నారు. ముందుగా బ్లూ రివల్యూషన్ పితామహుడు డాక్టర్ హీరలాల్ చౌదరి చిత్రపటానికి వారు నివాళులర్పించారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు మాట్లాడుతూ ఆదిత్యలో ఫిషరీస్ కోర్సుకు ప్రాధాన్యమిచ్చి పరిశోధన ల్యాబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. కళాశాల డైరెక్టర్ సగుణారెడ్డి మాట్లాడుతూ పరిశోధన, ఉద్యోగ అవకాశాలకు వెనుకడుగు వేయకుండా ప్రత్యేక చొరవతీసుకుంటున్నామని, విద్యార్థులు ఉత్తమ శాస్త్రవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సత్యనారాయణ, ఫిషరీస్ ఇన్‌చార్జ్ నరసింహమూర్తి, స్వాతి, అనిల్, సుభాషిణి పాల్గొన్నారు.

ఎస్‌బీఐ దాతృత్వం @ రూ.కోటి

- జీజీహెచ్ చంటి పిల్లల విభాగానికి విలువైన వైద్య పరికరాల అందజేత



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విష్ణువర్ధన్. చిత్రంలో డాక్టర్ లావణ్యకుమారి, డాక్టర్ మాణిక్యాంబ తదితరులు

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లోని చంటిపిల్లల విభాగం అధునాతన వైద్య పరికరాలతో నూతన శోభను సంతరించుకుంది. స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో పిడియాట్రిక్స్ పీజీ అభ్యసించి అమెరికాతో స్థిరపడిన తెలుగు తేజం డాక్టర్ శశిధర్ చొరవతో మంగుళూరుకు చెందిన చైల్డ్ హెల్త్ గ్రూప్ సౌజన్యంతో ఎస్‌బీఐ ఫౌండేషన్ రూ.కోటి విలువైన వైద్య ఉపకరణాలను చంటి పిల్లల విభాగానికి సమకూర్చింది. ఈ మేరకు జీజీహెచ్‌లోని పీజీ సెమినార్ హాల్లో పిడియాట్రిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బుర్రి రాంబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హెచ్‌వోడీ డాక్టర్ మాణిక్యాంబ అధ్యక్షతన ప్రారంభించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్‌లు ఈ యంత్ర పరికరాలను ప్రారంభించారు. డాక్టర్ శశిధర్ చొరవతో ఎస్‌బీఐ ఈ సాయం చేయడం అభినందనీయమని తెలిపారు విష్ణువర్ధన్ తెలిపారు. హెచ్‌వోడీ డాక్టర్ మాణిక్యాంబ మాట్లాడుతూ ఎస్‌బీఐ ఫౌండేషన్ రెండు వెంటిలేటర్లు, థెరాపెటిక్ హైపోథర్మియా యంత్రం, లామినార్ ఎయిర్‌ఫ్లో వర్క్ స్టేషన్, పోనోస్కైట్ ఎడ్జ్, ఫిలిప్స్ ఎఫీషియా యంత్రాలను సమకూర్చిందన్నారు. సమావేశంలో జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్ సహా పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ విద్య, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయభాస్కర్, పీడియాట్రిక్స్ పీజీలు పాల్గొన్నారు.

